క్లుప్తంగా

మోకాళ్లపై కార్మికుల నిరసన



మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ కార్మికులు

పెద్దాపురం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 39వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం సత్వరమే తమ సమస్య పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందంటూ శనివారం కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సుంకర నాగేశ్వరరావు, ఆకుల రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ 15 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాసిన భద్రరావు, కె.వెంకటరమణ, వాకాడ భాస్కర్, సత్తిరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే యోగా లక్ష్యం



అచ్చంపేటలో యోగా సాధనలో పాల్గొన్న ప్రజలు, ప్రభుత్వ సిబ్బంది

సామర్లకోట: ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ యోగా చేయాలనే ప్రచారం మేరకు శనివారం అచ్చంపేట గ్రామంలో పిల్లలు, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్ని యోగా చేశారు. ఈ నెల 21న యోగా దినోత్సవం పురస్కరించుకుని నేటి నుంచి యోగాపై సాధన నిర్వహించాలని కలెక్టరు ఆదేశాల మేరకు అచ్చంపేట పంచాయతీ కార్యదర్శి మణికుమార్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ వీరంరెడ్డి చిన్నబాబు మాట్లాడుతూ ప్రతీ రోజు ఒక గంట సమయం యోగాకు కేటాయిస్తే షుగర్, బీపీ వంటి వ్యాధులు దూరమవుతాయన్నారు. యోగా గురువు లక్ష్మణ్‌కుమార్ శిక్షణ నిర్వహించగా పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎం లు, మహిళా సంఘాల ప్రతినిధులు, యానిమేటర్లు, అంగన్‌వాడీ టీచర్లు సాధనలో పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పురస్కారాలు



విద్యార్థిని సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్, అర్బన్ పరిధిలో ఎస్ఎస్‌సీ–2025లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం, పురస్కారాల కార్యక్రమం శనివారం స్థానిక రెవెన్యూ కాలనీలోని హబియా కల్యాణ మండపంలో జరిగింది. సంస్థ అధ్యక్షులు ఎండీ హలీమ్ అధ్యక్షత వహించారు. ప్రముఖ మోటివేటర్ అబ్దుల్ అజీజ్, సంస్థ గౌరవాధ్యక్షురాలు షర్మిల, లీగల్ అడ్వయిజర్ ఎజాజుద్దీన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో చదివిన 32 మంది ముస్లిం, 62 మంది ముస్లిమేతర విద్యార్థులకు మెమెంటోలు, మెడల్లు, సర్టిఫికెట్లు అందజేశారు. హలీమ్ మాట్లాడుతూ, విద్యార్థులు నైతిక విలువలు కలిగి ఉండి, ఉన్నత చదువులు అభ్యసించి తమ కలలు నెరవేర్చుకోవాలన్నారు. సంస్థ ద్వారా 41 పాఠశాలకు చెందిన విద్యార్థులను సత్కరించడం గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీజే సభ్యులు, పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి తవ్వితే కఠిన చర్యలు

కొత్తపల్లి: మండలం పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ చిన్నారావు అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పొలాలు మెరక పేరుతో మట్టి తవ్వకాలు చేపట్టరాదన్నారు. పొలాలు మెరక చేసుకుంటే పొల్లాల్లోనే తప్ప మట్టిని తరలించరాదన్నారు. తీరప్రాంతాల గ్రామాల ప్రాంతాల్లో అనుమతులు లేకుండా బొండు ఇసుక తవ్వకాలు చేపట్టరాదన్నారు. తవ్వకాలు చేపడితే రెవెన్యూ, పోలీసులకు సమాచారం అందించి అధికారులకు సహకరించాలన్నారు.

దివ్యాంగులకు యోగా శిక్షణ

బోట్‌క్లబ్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక కల్పనా సెంటర్‌లోని మహర్షి సాంబమూర్తి దివ్యాంగ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏపీ యోగా విద్యాపీఠం రాష్ట్ర అధ్యక్షులు చిట్టూరి చిట్టిబాబు ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు.నిత్యం యోగా చేయాలని జీవితంలో ఓ భాగం చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాల చైర్మన్ జవహర్ ఆలీ ఈ శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచి యోగాభ్యాసాన్ని అలవాటుగా చేసుకోవాలని దివ్యాంగ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని రామలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాధులు ముసురుకొనే వేళ..



పెద్దాపురం ఏరియా ఆసుపత్రిలో ఓపీ వద్ద క్యూలో నిల్చున్న రోగులు



సదరం క్యాంపు వద్ద వేచి ఉన్న విభిన్న ప్రతిభావంతులు

- వైరస్‌లు వ్యాప్తికి అనువైన కాలం
- వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యులు

పెద్దాపురం: వర్షా కాలం ప్రారంభమైందంటే చాలు బాక్టీరియాలు, వైరస్ వ్యాప్తితో మానవుల ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. దీంతో ఆసుపత్రుల్లో అధిక సంఖ్యలో రోగులు కనబడతుంటారు. సాధారణంగా ఆటలమ్మ (పొంగు, చికెన్ పాక్స్), గవద బిల్లలు, అతిసార, విషజ్వరాలు చిన్నపిల్లల్లో కనిపించే ఈ వ్యాధులు గాలి, నీరు ద్వారా ఒకరి నుంచి మరొకరి వ్యాపిస్తుంటాయని వైద్యులు చెబుతున్నారు. ఈ నెల 24 నుంచే ఆషాఢం ప్రారంభంకానుంది. ఆషాఢంలో డయేరియా, అతిసారం, మలేరియా, టైఫాయిడ్ వ్యాధుల బారిన పడుతుంటారు. గతంలోనూ ఆషాఢ సమయంలోనే పెద్దాపురం పట్టణాన్ని డయేరియా మహమ్మారి ఒక్క ఊపు ఊపేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో పరిసరాల పరిశుభ్రత, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెద్దాపురం పరిధిలో

పెద్దాపురం అర్బన్, రూరల్ పరిధిలో ఏరియా ఆసుపత్రి (సీహెచ్‌ఎన్‌సీ), అర్బన్ ఆసుపత్రితో పాటు, పులిమేరు, కాంద్రకోట పీహెచ్‌సీలు ఉన్నాయి. అర్బన్ ఆసుపత్రి పరిధిలో 29 వార్డులు, రెండు పీహెచ్‌సీల పరిధిలో 28 గ్రామాలు, ఏరియా ఆసుపత్రి పరిధిలో పెద్దాపురం మండలంతో పాటు గండేపల్లి, జగ్గంపేట, రంగంపేట మండలాల ప్రజలు వైద్యం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి వస్తుంటారు. ఆయా పరిధిలో పదేళ్ల లోపు చిన్నారులు సుమారు లక్ష పైమాటే. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కలుషిత ఆహారం, తాగునీరు కారణంగా సంభవించే అతిసార ప్రాణాంతకమైనది. వర్షాకాలంలో ఈ వ్యాధి కేసులు అధికంగా నమోదవుతుంటాయి. కాచి చల్లార్చిన నీటిని తాగడంతో వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చు. గతంలో పెద్దాపురం పట్టణం, కాంద్రకోట, మర్లావ తదితర ప్రాంతాల్లో అతిసార, డయేరియా ప్రబలి సుమారు 150 కేసులు నమోదు అయ్యాయి, అధికార యంత్రాంగా అప్రమత్తమై పట్టణ, గ్రామాల్లో సర్వే నిర్వహించి వాటర్ ట్యాంక్‌లను, కాలువలను శుభ్రం చేసి హడావుడి చేశారు. పది రోజుల వరకు ఆయా ప్రాంతాల్లో సాధారణ పరిస్థితికి తీసుకురాలేని సంఘటనలు ఉన్నాయి. పారిశుధ్యంపై దృష్టి సారించకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చేలా ఉందని పలువురు వైద్య ఆరోగ్య నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గవద బిళ్లలు

గవద బిళ్లలు వ్యాధి సోకితే గొంతి నొప్పి ఉంటుంది. మింగలేని పరిస్థితిలో నిస్సత్తువ, నీరసం, ఆకలి లేక పోవడం, వంటి లక్షణాలు ఉంటాయి. వేడి తీవ్రతతో శరీరంలో నీటి శాతం తగ్గుతుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. శక్తిని ఇచ్చే పండ్ల రసాలు, కొబ్బరి నీళ్ల వంటి ద్రవపదార్థాలు తీసుకోవాలి.ఓఆర్ఎస్ వంటి ద్రవణాలు తీసుకోవడం మంచింది.

విష జ్వరాలు

కలుషిత నీటిని తాగడం వల్ల టైఫాయిడ్, దోమకాటు ఇతర సమస్యల వల్ల విష జ్వరాలు సోకుతాయి. జ్వరం వస్తే అదే తగ్గిపోతోందనే ఆపోహను మొదట వీడాలి. వైద్యులను సంప్రదించి పరీక్షల ద్వారా క్రమ పద్ధతిలో చికిత్స పొందాలి. శీతలపానీయాలకు దూరంగా ఉండాలి.

వైద్యులను సంప్రదించాలి



విష జ్వరాలు సోకినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. వెంటనే వైద్యులను సంప్రదించి సకాలంలో వైద్యం చేయించుకోవాలి. వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటిస్తే మంచిది. శుభ్రత పాటిస్తూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి. డయేరియా, మలేరియా, టైఫాయిడ్ వ్యాధి సోకితే మందస్తు జాగ్రత్తలు పాటించాలి

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం.

జాగ్రత్తలు అవసరం



ఒకటి రెండు రోజుల వరకు జ్వరం ఉంటే తక్షణమే వైద్యులను సంప్రదించాలి. వేసవి నుంచి వర్షా కాలం మారుతున్న సమయంలో వాంతులు, విరోచనాలు అధికమైతే వెంటనే ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఈగలు వాలిన ఆహారాన్ని సేవించకూడదు. ఈగలు రాకుండా ముందస్తుగానే చర్యలు తీసుకుని పరిశుభ్రమైన నీటిని, ఆహారాన్ని తీసుకోవాలి.

– డాక్టర్ జగదాంబ, ఏరియా ఆసుపత్రి వైద్యులు , పెద్దాపురం

కార్యకర్తలకు తోడుగా వైఎస్సార్ సీపీ



కాండ్రకోటలో ఉద్దగిరి ఆనంద్‌ను పరామర్శిస్తున్న ఇంచార్జి దొరబాబు

పెద్దాపురం: కార్యకర్తకు ఏ కష్టం వచ్చిన వైఎస్సార్ సీపీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ పెద్దాపురం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని కాండ్రకోట, చదలాడ గ్రామాల్లో ఇటీవల గాయాలపాలైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు అధిష్ఠానం ఎలప్పుడూ అండగా ఉంటుందన్నారు. కాండ్రకోటకు చెందిన పార్టీ కార్యకర్తలు ఉద్దగిరి ఆనంద్, బోడెం పోలయ్య, చదలాడకు చెందిన తోలెం రాంబాబు కుమారుడుల ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మి నారాయణ, వాసిరెడ్డి శ్రీనివాస్ తదితరులున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కాకినాడ రూరల్: విపత్కర సమయాల్లో పనికొచ్చే రక్తదానం ప్రాణదానంతో సమానమని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రక్తంలో ఏ, బీ, ఏబీ, ఓ గ్రూపులను కనుగొన్న కార్ ల్యాండ్ స్టీనర్ జన్మదినాన్ని రక్తదాతల దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. ప్రమాదాలు, ఆపరేషన్లు, అవయవ మార్పిడి చికిత్సలు తదితర వాటిని వినగానే గుర్తుకొచ్చేది రక్తమేనన్నారు. 15 నుంచి 60 ఏళ్ల వారు ఎవరైనా రక్తదానం చేయవచ్చన్నారు. పురుషులైతే మూడు నెలలకు ఓసారి, మహిళలైతే ఆరు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదానంతో ఆపదలో ఉన్న వారి జీవితాలను కాపాడటమే కాకుండా, దీర్ఘకాలం ఉత్సాహంగా పనిచేయగలిగే అవకాశాన్ని కల్పించడమేనని వివరించారు. ఈ సందర్భంగా 118 సార్లు రక్తదానం చేసిన జి.కృష్ణమోహన్‌ను అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు శిరీష, బుద్ధరాజు సత్యనారాయణరాజు, రేలంగి బాపిరాజు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అందరూ రక్తదానం చేయాలి

బోట్‌క్లబ్: స్వచ్ఛంద రక్తదానం చేయడం ద్వారా ఎంతో మందిని కాపాడిన వారవుతామని బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పసుమర్తి సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని స్థానిక నూకాలమ్మ గుడి వద్ద నున్న అక్షయ బ్లడ్ బ్యాంక్‌లో శనివారం నిర్వహించారు. బ్లడ్ బ్యాంకు చైర్మన్ కె.ప్రణీత్ మాట్లాడుతూ, రక్తదాతలకు ప్రత్యేక బీమా కవరేజీ అమలవుతుందని, అంతేకాక ఏడాది కాలంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే రక్తాన్ని సకాలంలో అందిస్తారని చెప్పారు. అందుకు సంబంధించిన ప్రత్యేక ఐడీ కార్డు కూడా దాతలకు ఇస్తామన్నారు. స్వచ్ఛంద రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని కోరారు. పసుమర్తి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా కనీసం ముగ్గురి ప్రాణాలను కాపాడగలమని వివరించారు. ప్రమాద బారిన పడిన వారికి, ఆపరేషన్ చేయించుకుంటున్న వారికి ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

రైసు మిలర్లకు అధికారుల దాసోహం

- రైతు భరోసా కేంద్రాలు నిర్వీర్యం
- బస్తాకు రూ.100కు పైగ ఎగవేత
- మధ్యవర్తుల ఖాతాల్లోకి రవాణా బిల్లులు



రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన వెస్ ఎంపీపీ వెంకట్రాయుడు

సామర్లకోట: రైతులకు ప్రభుత్వం, అధికారులు అన్యాయం చేస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు ఆరోపించారు. గురువారం సాయంత్రం జరిగిన మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు పేర్నిడి వెంకట్రాయుడు మాట్లాడుతూ నెల రోజులు గడుస్తున ధాన్యం సొమ్ములు జమ కావడం లేదన్నారు. మిల్లర్లు బస్తాకు రూ.25 ముందుగా చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు.

దోపిడి ఇలా

గిటుబాటు ధర రూ.1,725 గా ప్రభుత్వం నిర్ణయించగా పలువురు రైతులకు కేవలం రూ.1,200 నుంచి రూ.1600 మాత్రమే చెల్లిస్తున్నారని పీబీ దేవం ఎంటీపీసీ సభ్యుడు మలకల సూరిబాబు ఆరోపించారు. తాను స్వయంగా 1,000 బస్తాలు విక్రయించగా 200 బస్తాలకు రూ.1,725 జమకాగ మిగిలిన 800 బస్తాలకు రూ.1,600 జమ అయిందన్నారు. రైతుల కష్టాని ఈ విధంగా దోచుకుంటున్నా అధికారులు మౌనం వహిస్తున్నారని విమర్శించారు. మిల్లర్లు దోపిడి చేస్తూ ఉంటే వ్యవసాయాధికారులు వారి వద్ద చేతులు కట్టుకొంటున్నారని ఎద్దేవా చేశారు.

మధ్యవర్తుల లాభార్జన

రవాణా బిల్లులు రైతులు ఖాతాలలో జమ కావలసి ఉండగా మధ్య వ్యక్తులు ఖాతాల్లో జమ అవుతుందని ఆరోపించారు. అధికారులు ఆర్‌బీకెలను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యాబట్టారు. వీటిలో టెక్నికల్ అసిస్టెంట్లకు పనిలేక పోయినా నియమకాలు చేయడం వింతగా ఉందని సూరిబాబు ఆరోపించారు. ధాన్యంకు సంబంధించి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. రైతుల సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని వ్యవసాయశాఖ ఎఈఓ రూప తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ఈ నెలలో అమలవుతుందని వెల్లడించారు.

నవోదయ పేరెంట్స్ నూతన కమిటీ



నవోదయ విద్యాలయ నూతన పేరెంట్స్ కమిటీ ప్రతినిధులు

పెద్దాపురం: స్థానిక జవహార్ నవోదయ విద్యాలయ పేరెంట్స్ కమిటీ ఎన్నిక శనివారం ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా 450 మంది విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాగా పేరెంట్స్ కమిటీ ఎన్నికలు నిర్వహించి పదిమంది పేరెంట్స్‌ను ప్రతినిధులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి మాట్లాడుతూ విద్యాలయ అభివృద్ధి, పురోగతికి పేరెంట్స్ సహకారం ఎంతో అవసరమన్నారు. వారిలో నుంచి అందరి ఏకాభిప్రాయంతో పది మంది ప్రతినిధులను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికలో టి.దుర్గ, ఎం.కిషోర్, ఎస్.ఆదిలక్ష్మి, ఎ.నారాయణ, ఎం.రామలింగేశ్వరరావు, కె.ఉష, శ్రీనివాస్, జి.విష్ణు, పి.శ్రీనివాస్, ఎస్.సూరిబాబు ఎన్నికైనట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య, పీఈటి సనపాల సత్యన్నారాయణ, చక్రవర్తి, జగన్మోహనరావు, ప్రేమలత, మధుబాల తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు



సామర్లకోట-కాకినాడ రోడ్డులో అచ్చంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ మళ్లిస్తున్న పోలీసులు

సామర్లకోట: ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనుల నేపథ్యంలో స్థానిక కాకినాడ రోడ్డులో శనివారం ట్రాఫిక్ మళ్లించారు. సామర్లకోట–కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జికి సంబంధించి గడ్డర్లు ఏర్పాటు చేస్తున్నారు. అచ్చంపేట జంక్షన్ నుంచి ఉండూరు జంక్షన్, ముత్యాలమ్మ ఆలయం, వీకే రాయపురం, పంచారామ క్షేత్రం, హుస్సేన్‌పురం, సామర్లకోట రైల్వే ట్రాక్ మీదుగా సామర్లకోట–పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ వరకు జాతీయ రహదారి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. అధునాతన సాంకేతిక పద్ధతిలో సిమ్మెంటు స్తంభాలను నిర్మించి, వాటిపై గడ్డర్లు ఏర్పాటు చేస్తూ.. ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా కాకినాడ రోడ్డులో ముత్యాలమ్మ ఆలయం వద్ద గడ్డర్ల ఏర్పాటు కారణంగా వాహనాలకు ప్రమాదాలు వాటిల్లే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌ను మళ్లించారు. సామర్లకోట నుంచి కాకినాడ వెళ్లే వాహనదారులు అచ్చంపేట ఏడీబీ రోడ్డు మీదుగా ఉండూరు జంక్షన్ నుంచి వీకే రాయపురం, మాధవపట్నం మీదుగా కాకినాడ చేరేలా ఏర్పాట్లు చేశారు. అలాగే అచ్చంపేట ఏడీబీ రోడ్డులో అచ్చంపేట జంక్షన్ నుంచి కాకినాడ చేరుకునేలా ట్రాఫిక్ మళ్లించారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డుపై డివైడర్లు ఏర్పాటు చేసి పోలీసు సిబ్బంది ట్రాఫిక్ మళ్లిస్తున్నారు.

దూరవిద్య వారాంతపు తరగతులు ప్రారంభం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రా యూనివర్సిటీలో దూర విద్యను అభ్యసిస్తున్న బీఏ, బీకాం విద్యార్థులకు వారాంతపు తరగతులు (ప్రతి శని, ఆది) స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ ఆంజనేయులు శనివారం తెలిపారు. 2022 ఫైనలియర్, 2024 మూడు, నాలుగో సెమిస్టర్, 2025 ఒకటి, రెండో సెమిస్టర్ విద్యార్థులకు ఈ తరగతులు జూలై 13 వరకు జరుగుతాయన్నారు. ఉదయం 8.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యార్థులు ఉండాలన్నారు. ఈ తరగతులను డిస్టెన్స్ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.నాగేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకుని, తరగతులకు హాజరు కావాలని కోరారు.

పరిశోధనే ప్రాణానికి ఉనికి

- ముగిసిన వైద్య విజ్ఞాన సదస్సు ఎరెవ్నా 4.0
- 500 మందికి పైగా వైద్య విద్యార్థుల హాజరు



ఎరెవ్నా కోర్ కమిటీతో ఆర్గనైజింగ్ కమిటీ, అతిథుల బృందం



ఎరెవ్నా ముగింపు సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రావు. చిత్రంలో మురళీకృష్ణ

కాకినాడ క్రైం: పుట్టుకొస్తున్న వ్యాధులు, వాటి కారకాలపై యుద్ధం ప్రకటించాల్సిన అవసరం ఉందని వైద్య విద్యార్థులకు నిపుణులు ఉద్బోధించారు. కేవలం పరిశోధనలతోనే ప్రాణం ఉనికి సాధ్యమని స్పష్టం చేశారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల వైద్య విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ అధ్యక్షతన మూడు రోజులుగా కొనసాగిన ఎరెవ్నా 4.0 వైద్య విజ్ఞాన సదస్సు శనివారంతో ముగిసింది. ఈ ముగింపు కార్యక్రమానికి గౌరవ అతిథులుగా డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్, విశ్రాంత డీఎంఈ డాక్టర్ ఐవీ రావు, జేఎన్‌టీయూకే మాజీ వీసీ కేవీఎస్‌జీ మురళీ కృష్ణ, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి హాజరయ్యారు.

విజ్ఞాన దాహం తీరేలా..

ఎరెవ్నా సదస్సు ఈ నెల 12 నుంచి 14 వరకు సాగింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ల ద్వారా సుమారు 600 మంది నమోదు చేసుకోగా, 500 మంది వివిధ జిల్లాలకు పొరుగు రాష్ట్రాలకు చెందిన వైద్య విద్యార్థులు హాజరయ్యారు. గురువారం కాకినాడ జీజీహెచ్ ఎదురుగా ఉన్న ఫార్మకాలజీ లెక్చర్ గ్యాలరీలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్ర డీఎంఈ డాక్టర్ రఘునందన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యశాలలు, పేపర్ ప్రజెంటేషన్లు, చర్చాగోష్ఠిలు, క్విజ్ పోటీలు, విజ్ఞానదాయక పోటీల ద్వారా విద్యార్థులు తమ విజ్ఞాన తృష్ణను తీర్చుకున్నారు. శుక్రవారం కళాశాల ఆవరణకు చేరి సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలతో అదరగొట్టారు.

పరిశోధనంటే ప్రాణశోధనే..

వైద్య రంగానికి పరిశోధన ఆత్మ వంటిదని డాక్టర్ ఐవీ రావు వ్యాఖ్యానించారు. పరిశోధన అంటే అక్షరాలా ప్రాణశోధనేనని స్పష్టం చేశారు. కొత్త రకం వ్యాధులు, పుట్టుకొస్తున్న వైరస్ వేరియంట్లు మూకదాడి చేస్తున్న విపత్కర తరుణంలో కేవలం పరిశోధనతోనే ప్రాణం ఉనికి సాధ్యమవుతుందన్నారు. ఈ దిశగా వైద్య విద్యనభ్యసిస్తున్న నవతరం ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్షణకాలంలో దేవుడు ప్రాణం పోస్తే, జీవిత కాలం పాటు ఆ ప్రాణాన్ని కాపాడే అపర బ్రహ్మ వైద్యుడని అన్నారు. డాక్టర్ విష్ణువర్ధన్ సారథ్యంలో రంగరాయ వైద్య కళాశాలలో పరిశోధన ప్రధాన విద్యాబోధన అమలవుతుండడం, మెరికల్లాంటి భవిష్యత్ తరం వైద్యుల రాకపై బంగారు ఆశల్ని చిగురింపజేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

వైద్యుడై.. గౌరవం లేకపోతే..

వైద్యుడై ఉండీ గౌరవం లేకపోవడం అత్యంత దురదృష్టకరమైన స్థితి అని నోబెల్ అవార్డు గ్రహీత జార్జి బెర్నార్డ్ షా తన డాక్టర్స్ డైలమా అనే పుస్తకంలో రాశారని జేఎన్‌టీయూకే మాజీ వీసీ డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. వస్త్రేణ వపుషా వాచా విద్యయా వినయేనచ అనే సంస్కృత శ్లోకం వైద్యుడిగా తాను అర్హుడైన తన పూర్తి గౌరవాన్ని పొందేలా తీర్చిదిద్దుతుందన్నారు. ఈ శ్లోకాన్ని అనుసరించి మృదుత్వం, భాష, కరుణ వైద్యుడికి కట్టని వస్త్రాలని, రోగికి వైద్యుడు కనిపించే విధానమే దివ్యౌషధమని చెప్పారు. అంతటి ఘనమైన విద్యను వినయపూర్వకంగా ఆచరణలో పెట్టడం వైద్యుడికి భూషణమని, రోగికి వరమన్నారు.

ఎరెవ్నా నిర్వహణ అమోఘం



ఎరెవ్నా 4.0 సదస్సు నిర్వహణ అమోఘం. విద్యార్థులు ప్రతి క్షణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఆ దిశగా కృషి చేసిన ఆర్ఎంసీ ప్రిన్సిపాల్, ఆయన బృందానికి అభినందనలు. ఇతర వైద్య కళాశాలలు కూడా ఇదే స్ఫూర్తిని చూపించి, విద్యార్థులను ప్రయోగాత్మక విద్యాబోధన వైపు నడిపించాలి. భవిష్యత్ తరం వైద్యులను మెరికల్లా తీర్చిదిద్దాలి.

– డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, డీఎంఈ

కోర్ కమిటీదే క్రెడిట్

ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్, కో–కన్వీనర్లుగా ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ డీవీఎస్ శశి, డాక్టర్ ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా డాక్టర్ కేవీఎస్ సత్యవాణి, కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ ఆర్.రాజ్యలక్ష్మి, కల్చరల్ బోర్డు వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కె.శైలజ వ్యవహరించారు. వీరి ఆధ్వర్యంలో విద్యార్థులతో కూడిన కోర్ కమిటీ కీలక పాత్ర పోషించింది. ఆర్గనైజింగ్ సెక్రటరీ హోదాలో మెడికో టి.హరికృష్ణ ప్రసాద్ తన బృందంతో మూడు రోజుల సదస్సు బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించారు. కోర్ కమిటీలో ఫైనాన్స్ టీం, సోషల్ మీడియా అండ్ డిజైనింగ్ టీం, అకామిడేషన్ టీం, ఫుడ్ టీం, కల్చరల్ టీం, పబ్లిక్ రిలేషన్స్ అండ్ స్పాన్సర్‌షిప్ టీం క్రియాశీలకంగా వ్యవహరించాయి. సదస్సు అనంతరం వివిధ పోటీలు, పేపర్ ప్రెజెంటేషన్లలో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే, వివిధ డిపార్టుమెంట్ల బృందాలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు.

భారతీయ వైద్యులకు మంచి డిమాండ్

ప్రపంచ వ్యాప్తంగా భారతీయ వైద్యులకు మంచి డిమాండ్ ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి అన్నారు. పరిశోధక అంశాలపై విషయావగాహన కలిగి ఉండడమే అందుకు కారణమని చెప్పారు. వైద్య శాస్త్రం ఓనమాలు దిద్దడంలో భారతీయత, పూర్వపు వైద్య ఉద్దండులు కీలక పాత్ర పోషించారన్నారు. డాక్టర్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ, పరిశోధన, సాంకేతికత మేలిమి సమ్మేళనమే భవిష్యత్ వైద్య రంగమని అన్నారు. ఈ రెండింటితో కూడిన విషయావగాహన వైద్య విద్యార్థుల్లో లోపిస్తే వాళ్లు వైద్యులు కారని చెప్పారు. ఆయా అంశాల ప్రాతిపదికన రంగరాయ వైద్య కళాశాలలో బోధనా వ్యవస్థ కొనసాగుతోందనిచ డీఎంఈ డాక్టర్ నరసింహం సహకారం ఎనలేనిదని కొనియాడారు. శనివారం నాటి ముగింపు సభకు కాకినాడకు చెందిన ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్టు, ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆదిత్య సత్యప్రసన్న, కంటి వైద్య నిపుణుడు, నయన ఆసుపత్రి ఎండీ డాక్టర్ శ్రీరామ్‌తో పాటు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డాక్టర్ శ్రీనివాసన్ హాజరయ్యారు.



ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్‌కు మెమెంటో ఇస్తున్న డాక్టర్ రావు



మెమెంటో అందుకుంటున్న సర్జరీ బృందం



ఉత్తమ ప్రజెంటేషన్‌కు మెరిట్ సర్టిఫికెట్ అందుకుంటున్న తేజస్వీ సంజన (మెడికో, జీఎంసీ, సంగారెడ్డి)